శరవేగంగా అభివృద్ధి పనులు

- 42వ వార్డులో రోడ్లు, డ్రైనేజీల ఆధునీకరణ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డులో చేపడుతున్న అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. వార్డు పరిధి రైల్వే న్యూకాలనీలోని పలు ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీల ఆధునీకరణ కోసం ఇటీవల మేయర్ గొలగాని హరివెంకటకుమారితో కలిసి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు శంకుస్థాపన చేశారు. ఈ పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్లు ఒకొక్కటిగా పూర్తి చేస్తున్నారు. రైల్వే న్యూకాలనీ మసీదు జంక్షన్ వద్ద కల్వర్టు, ప్రాథమిక పాఠశాల వద్ద కల్వర్టులు పూర్తయ్యాయి. హరగోపాల్ స్కూల్ లైన్, మూడు గుళ్ల ప్రాంతం వద్ద డ్రైనేజీలు, సీసీ రోడ్లు, కన్నారావు వీధిలో రహదారులు, డ్రైనేజీల పనులు పూర్తి చేశారు. దక్షిణ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే జగన్నాథపురం, చాకలిపేట రోడ్లకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ పనులు కూడా ఇటీవలే పూర్తిచేశారు.

కార్పొరేటర్ ప్రత్యేక చొరవతో..

స్థానిక కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో వార్డులో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. కార్పొరేటర్‌తోపాటు వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆళ్ల శ్రీనివాస్ ఎప్పటికప్పుడు వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్నారు. జీవీఎంసీ మేయర్ హరివెంకటకుమారి, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ల సహకారంతో వార్డులో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి సకాలంలో పూర్తిచేస్తున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. రైల్వే న్యూకాలనీ రామాలయం వీధి, రెల్లి వీధి అంబేడ్కర్ విగ్రహం నుంచి గ్రంధి శ్రీనివాసరావు(అడ్వకేట్) కార్యాలయం వరకు బీటీ రోడ్లు వేయాల్సి ఉంది. ఈ పనులను కూడా త్వరలోనే ప్రారంభిస్తామని జీవీఎంసీ సిబ్బంది తెలియజేస్తున్నారు.



42వ వార్డు కన్నారావు వీధిలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం



ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యమిస్తున్న క్రమంలో వార్డులో రహదారులు, డ్రైనేజీల ఆధునికీకరణను ముందుగా ప్రారంభించి పూర్తిచేయించాం. వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. మరికొన్ని పనులను త్వరలోనే ప్రారంభిస్తాం.

– ఆళ్ల లీలావతి, కార్పొరేటర్, 42వ వార్డు

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మురళీనగర్: మద్రిపాలెం సెక్షన్ పరిధిలోని గ్రీన్ గార్డెన్స్, బాపూజీనగర్ 11 కేవీ ఫీడర్లలో నిర్వహణ పనులు కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పార్వతీనగర్, హుస్సేన్ నగర్, పంజాబ్ హోటల్ జంక్షన్, గ్రీన్ గార్డెన్స్, సాయినగర్, బాపూజీనగర్, భవానీ గార్డెన్స్, సిద్ధార్థనగర్, గణేష్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

కైలాసపురం ఫీడర్‌లో..

తాటిచెట్లపాలెం: కైలాసపురం ఫీడర్ పరిధిలోని హై టెన్షన్ లైన్లలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–1 ఈఈ బి.సింహాచలంనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కస్తూరినగర్, కైలాసపురం మెయిన్ రోడ్, మధుసూదననగర్, దత్తసాయినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రూ.40 లక్షలతో అభివృద్ధి పనులు



శంకుస్థాపన చేస్తున్న కె.కె.రాజు, బాణాల శ్రీనివాసరావు

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డు మాదేటి గార్డెన్స్‌లో రూ.40 లక్షల వ్యయంతో సీసీ డ్రెయిన్లు, గెడ్డ బాటం కాంక్రీట్ పనులు చేపట్టనున్నారు. గురువారం ఈ పనులను నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావుతో కలిసి శంకుస్థాపన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో హబీబ్, ఖాన్, హరినాథ్, వెంకటరావు, సీతారాం, గోపి, రామారావు, హేమలత, నాగమణి, శ్రీను, గ్రామ పెద్దలు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు, మహిళలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

చోరీపై దర్యాప్తు ముమ్మరం

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ క్రైం పోలీస్ స్టేషన్ పరిధి బాలయ్యశాస్త్రి లేఅవుట్ మారుతీ నగర్‌లో జరిగిన భారీ చోరీ కేసులో క్రైం పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. రెండు బృందాలుగా ఏర్పడి దొంగల కోసం గాలిస్తున్నారు. మారుతీ నగర్‌లో కొత్తగా నిర్మించిన ఎంవీవీ సత్య హోమ్స్‌లో గతంలో పనిచేసిన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. సీసీ కెమెరాలు లేకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు. బుధవారం ఇద్దరిని తీసుకొచ్చి విచారించారు. అపార్ట్‌మెంట్ పనులు జరుగుతున్న సమయంలో ప్లాట్ నంబర్ 202కు సంబంధించి ఒక సెట్ తాళాలు ఎవరి వద్ద ఉన్నయన్న కోణంలో విచారిస్తున్నారు. వాచ్‌మెన్‌ను విచారించారు. మరో రెండు రోజుల్లో చోరీ కేసును ఛేదిస్తామని పోలీసులు చెబుతున్నారు.

మందుల వినియోగంపై కేంద్ర కమిటీ ఆరా



గొల్లలపాలెం పాఠశాలలో వివరాలు సేకరిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీలో గురువారం ఇద్దరు వైద్యులతో కూడిన కేంద్ర పబ్లిక్ రిలేషన్స్ కమిటీ పర్యటించింది. కేరళకు చెందిన వైద్యులు సజిత, అనితకుమారి ఈ బృందంలో ఉన్నారు. వీరు పంచాయతీలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఆరోగ్య సిబ్బంది ఎలాంటి మందులు ఇస్తున్నారు, ఏఏ పరీక్షలు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. తర్వాత పంచాయతీలోని ప్రజలతో వైద్య చికిత్సల గురించి మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వినియోగిస్తున్న మందుల గురించి ఆరా తీశారు. ఈ వివరాలతో నివేదిక తయారు చేస్తున్నట్లు చెప్పారు.

‘ఆరోగ్య సురక్ష’ను సద్వినియోగం చేసుకోండి



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు

మురళీనగర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జీవీఎంసీ 49వ వార్డు కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు సూచించారు. 49వ వార్డు 1086284 సచివాలయం పరిధి కాలనీల్లో గురువారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సర్వే జరుగుతున్న తీరును పర్యవేక్షించారు. పరీక్షలు చేయించుకున్న వారికి టోకెన్లు అందించారు. ఏఎస్సార్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఇంటింటి సర్వే చేశారు. కార్యక్రమంలో భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.రవికుమార్, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు



ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వెనుక రోడ్డులో మరమ్మతుల అనంతరం మ్యాన్‌హోల్

సాక్షి ఎఫెక్ట్..

సీతమ్మధార: సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వెనుక రోడ్డులో యూజీడీ మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేపట్టారు. ఇక్కడి మ్యాన్‌హోల్ చుట్టూ రాళ్లు బయటకు రావడంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ సమస్యపై బుధవారం ‘సాక్షి’లో ‘ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్’ శీర్షికన ప్రచురితమైన వార్తకు జీవీఎంసీ యూజీడీ విభాగం అధికారులు స్పందించారు. ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్‌కు గురువారం మరమ్మతులు చేశారు. సమస్య పరిష్కారమవడంతో స్థానికులు, వాహన చోదకులు, పాదచారులు హర్షం వ్యక్తం చేశారు.

దేవీ శరన్నవరాత్రులకు పందిరి రాట



నందగిరినగర్‌లో ముహూర్తపు రాట వేస్తున్న కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, మహిళలు



మాధవధార వుడా కాలనీలో రాట వేస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు నందగిరినగర్‌లో న్యూఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా గురువారం ఉత్సవ రాట కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ముఖ్య అతిథిగా ముత్తయిదువలతో కలిసి పందిరి రాట వేశారు. వరుసగా 13వ ఏడాది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. స్థానిక మహిళలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

51వ వార్డులో..

మద్రిపాలెం: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం 51వ వార్డులో పందిరి రాట కార్యక్రమం నిర్వహించారు. మాధవధార వుడా కాలనీ విజేత సూపర్ మార్కెట్ పక్కన శ్రీ కనకదుర్గ ఆటో స్టాండ్ సంఘం ఆధ్వర్యంలో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ కొబ్బరికాయ కొట్టి పందిరి రాట వేశారు. ఆటో స్టాండ్ సంఘం సభ్యులు, పార్టీ కార్యకర్తలు శ్యామ్, గణేష్ పాల్గొన్నారు.

మలుపుల వద్ద ఆటోల నిలిపివేత



సత్యం జంక్షన్‌లో మలుపు వద్ద నిలిపిన ఆటోలు

సీతమ్మధార: కొంతమంది ఆటో డ్రైవర్లకు రోడ్డు నిబంధనలు ఏమాత్రం పట్టడం లేదు. ప్రమాదమని తెలిసినా.. పదే పదే వాటిని మీరుతున్నారు. జాతీయ రహదారి సత్యం జంక్షన్‌లో మలుపుల వద్ద సిగ్నల్ పడే సమయంలో ఆటోలు నిలిపివేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గురుద్వారా నుంచి సీతమ్మధారకు వెళ్లే మలుపు మార్గంలో ఆటోలు నిలిపివేయడంతో అటువైపు వెళ్లే ఆర్టీసీ బస్సులకు ఇబ్బందికరంగా మారుతోంది. ఆటో డ్రైవర్లతోపాటు కొందరు ద్విచక్ర వాహన చోదకులు ట్రాఫిక్ రూల్స్ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సత్యం జంక్షన్‌లో నిత్యం ఇదే పరిస్థితి ఉంటోంది. ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కొండవాలులో దొంగతనాలు అరికట్టాలి



సీఐ సాయికి వినతిపత్రం అందిస్తున్న గంకల అప్పారావు

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు ఊర్వశి కూడలి జాతీయ రహదారి నుంచి బర్మాక్యాంప్ ప్రాంతాల్లో దొంగతనాలు, ఆకతాయిల ఆగడాలను అరికట్టాలని బీజేపీ వార్డు అధ్యక్షుడు గంకల అప్పారావు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు గురువారం కంచరపాలెం ఐదో పట్టణ లా అండ్ ఆర్డర్ సీఐ ఎస్.సాయిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల కొండవాలు ప్రాంతాల్లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, దొంగతనాలపై కార్పొరేటర్ గంకల కవిత దృష్టికి వార్డు ప్రజలు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో రాత్రి పూట పోలీస్ గస్తీ పెంచాలని సీఐ సాయిని అప్పారావు కోరారు. దీనిపై స్పందించిన ఆయన పోలీస్ గస్తీని పెంచి దొంగతనాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పరిశోధన రంగంలో రాణించాలి



విద్యార్థులకు జ్ఞాపికలు అందిస్తున్న డాక్టర్ అశోక్‌కుమార్ తదితరులు

ఏయూక్యాంపస్: ఫార్మా–డీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు పరిశోధన రంగంలో రాణించాలని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ కోరారు. గురువారం ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన ఫార్మా–డీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ మాట్లాడుతూ నూతన ఔషధాలు, మూలకాల అన్వేషణ జరిపే దిశగా కృషి చేయాలని సూచించారు. వైద్యులతో అనుసంధానంగా పనిచేయాలన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసిన తరువాత సమాజానికి మనం ఏ విధంగా ఉపయోగపడగలం అనే ఆలోచన కలిగి ఉండాలన్నారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ వైద్యునికి, రోగికి మధ్య అనుసంధానంగా ఫార్మా–డీ విద్యార్థులు నిలుస్తారన్నారు. ఔషధాలకు సంబంధించిన చట్టాలపై ఏపీ డ్రగ్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డెరైక్టర్ డాక్టర్ ఎస్.విజయ్ కుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆచార్య జి.శశిభూషణ రావు, ఆచార్య కేవీ రమణ మూర్తి, ఆచార్య జి.గిరిజా శంకర్, వి.గిరిజా శాస్త్రి, కె.ఈశ్వరకుమార్, ఏకేఎం పవార్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా యువజనోత్సవాలు



ముఖ్య అతిథి డాక్టర్ ఉమా మర్తితో ఉపాధ్యాయులు, విద్యార్థినులు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ నేతృత్వంలో ఎక్సెల్సియార్–23 యువజనోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా యూకే నుంచి విచ్చేసిన ప్రముఖ గైనకాలజిస్ట్, కళాశాల పూర్వ విద్యార్థిని డాక్టర్ ఉమా మర్తి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించి మాట్లాడారు. మహిళలు ఏ దేశంలో అయినా, ఏ రంగంలో అయినా ముందుంటారన్నారు. మహిళా సాధికారత కోసం కళాశాల చేస్తున్న కృషిని అభినందించారు. నృత్యం, సంగీతం, చిత్రలేఖనం, ఫొటోగ్రఫీ, ముఖాభినయం, నాటకం, ఏకపాత్రాభియ పోటీలలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరిచారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విజేతలకు శుక్రవారం జరిగే ముగింపు వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు ప్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ పీకే జయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో ప్రొగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ టి.భాస్కరసుధ, సిస్టర్ మేరీ, నాన్సీ, డాక్టర్ మాణిక్యకుమారి, హరిణి, సోనీ, పవన్, డాక్టర్ లక్ష్మీ ప్రభ, ప్రమీల, కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం




ఆరోగ్య కేంద్రంలో చేసిన ఏర్పాట్లు

సీతంపేట: శ్రీనివాసనగర్ దాడి రామ్మూర్తి కల్యాణ మండపంలో గల నరసింహనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరుగుతుందని మెడికల్ ఆఫీసర్ తనూజ తెలిపారు. 43, 44 వార్డులకు చెందిన 238, 239, 240, 241 సచివాలయాల పరిధిలోని ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరంలో స్పెషలిస్టులు, మెడికల్ ఆఫీసర్లు వైద్య సేవలు అందిస్తారన్నారు. ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, అవసరమైన రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తారని చెప్పారు.

పబ్లిక్ డిమాండ్

వీధిలైట్లు వెలిగించండి



రాంజీ ఎస్టేట్‌లో వెలగని లైటు

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం పరిధి రాంజీ ఎస్టేట్, కప్పరాడ, పెదకొత్తూరు కొండవాలు ప్రాంతాల్లో వీధి లైట్లు సక్రమంగా వెలగక చీకట్లు కమ్ముకుంటున్నాయి. పది రోజులుగా 91ఏ/1/5 విద్యుత్ స్తంభం లైట్లు పనిచేయడం లేదు. జీవీఎంసీ విద్యుత్ సిబ్బందికి ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. రాత్రి సమయంలో వీధుల్లో కుక్కల బెడదతోపాటు దొంగతనాల జోరు ఎక్కువగా ఉంది. వీధుల్లో రాకపోకలు సాగించాలంటే మహిళలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలి.

– కె.కామేశ్వరరావు, రాంజీ ఎస్టేట్

ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు



కరపత్రం అందిస్తున్న ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 51వ వార్డులోని 289 సచివాలయం పరిధి కళింగనగర్, మహత్ కాలనీ, వుడా కాలనీ ప్రాంతాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ, ప్రజా సమస్యలు తెలుసుకుంటూ పర్యటించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పరిపాలన సాగిస్తున్నారన్నారు. ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేరుస్తున్నారని చెప్పారు. అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారన్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్‌లు పైడి కృష్ణారావు మాస్టారు, అమర్‌రెడ్డి, డైరెక్టర్లు పైడి శ్రీను, రాయుడు శ్రీను, ప్రసూనారెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ ఎం.లక్ష్మి, 51వ వార్డు సీనియర్ నాయకులు బి.తిరుమలరావు, దమయంతి, శ్యామ్, వరలక్ష్మి, గణేష్, సాధు, లక్ష్మణ్, వినోద్, రాణి, చిన్ని, శ్రీను, భాను, బాబూరావు, సీనియర్ నాయకులు బోగవిల్లి గోవింద్, షేక్ బాబ్జి, ఎం.సునీల్, సంతోష్, వెంకటేష్, రాము, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఐ.డి.రాజు మృతికి సంతాపం



ఐ.డి.రాజు(ఫైల్)



రాజు మృతదేహం వద్ద సంతాపం తెలుపుతున్న కె.కె.రాజు తదితరులు

సీతమ్మధార: రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి వద్ద పర్సనల్ సెక్రటరీ(పీఎస్)గా పని చేస్తున్న ఐ.డి.రాజు(73) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. సీతమ్మధార అంబేడ్కర్ కాలనీలో ఆయన నివాసం. గతంలో ఏపీ కార్పొరేషన్(వైజాగ్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పని చేశారు. భార్య రత్నమణి, కుమార్తెలు శ్రావ్య, సౌమ్య ఉన్నారు. సొంత గ్రామం నర్సాపురం దరి నవరస పురంలో 1950లో జన్మించారు. రాజు మృతదేహానికి సొంత గ్రామంలో గురువారం దహన సంస్కారాలు నిర్వహించారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు తదితరులు రాజు కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు.

మహారాజా బ్యాంక్‌కు ప్రతిష్టాత్మక అవార్డులు



అవార్డు అందుకుంటున్న మహారాజా బ్యాంక్ వ్యవస్థాపక అధ్యక్షుడు రామకృష్ణంరాజు

సీతమ్మధార: ది మహారాజా కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ జాతీయ స్థాయిలో రెండు ప్రతిష్టాత్మక అవార్డులు అందుకున్నట్లు బ్యాంక్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.రామకృష్ణంరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కో ఆపరేటివ్ బ్యాంకింగ్ రంగానికి సంబంధించిన వ్యాపార పోటీల్లో ×ఫ్రంటియర్స్ ఇన్ కో ఆపరేటివ్ బ్యాంకింగ్–2023, బ్యాంకో బ్లూ రిబ్బన్–2023 అవార్డులను గెలుపొందినట్లు తెలిపారు. ఈ నెల 12న గోవా వేదికగా బ్యాంకింగ్ ఫ్రంటియర్స్ వారు నిర్వహించిన నేషనల్ కో ఆపరేటివ్ బ్యాకింగ్ సమ్మిట్, ఫ్రంటియర్స్ ఇన్ కో ఆపరేటివ్ బ్యాంకింగ్ అవార్డుల ప్రదాన కార్యక్రమంలో బెస్ట్ కేవైసీ ఇనిషియేటివ్ కేటగిరీలో అవార్డు సాధించారు. గోవా ప్రభుత్వం ఆధ్వర్యంలో సహకార శాఖ మంత్రి సుభాష్ శిరోద్కర్, బ్యాంకింగ్ ఫ్రంటియర్స్ గ్రూప్ ప్రెసిడెంట్ బాబునాయర్ చేతులు మీదుగా మహారాజా బ్యాంకు వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.రామకృష్ణంరాజు, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.మురళీకృష్ణ వర్మ అవార్డు అందుకున్నారు. రూ.225 కోట్ల నుంచి రూ.250 కోట్ల డిపాజిట్ కేటగిరిలో జాతీయ స్థాయిలో రెండో స్థానం సాధించినట్లు రామకృష్ణంరాజు వెల్లడించారు. 2019–2021లో బ్యాంకో బ్లూ రిబ్బన్ అవార్డును గెలుపొందగా.. ఈ ఏడాది రెండు అవార్డులు గెలుచుకున్నామన్నారు.

ధమ్మచక్ర మహోత్సవం రేపు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బొడ్డు కల్యాణరావు, జె.వి.ప్రభాకర్

సీతంపేట: రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో ఈ నెల 14న నిర్వహించనున్న 67వ ధమ్మచక్ర మహోత్సవాన్ని జయప్రదం చేయాలని అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డు కల్యాణరావు, జె.వి.ప్రభాకర్ కోరారు. గురువారం అంబేడ్కర్ భవన్‌లో కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1956 అక్టోబర్ 14న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ లక్షలాది మందితో కలిసి బౌద్ధాన్ని స్వీకరించారన్నారు.

నాటి నుంచి ప్రతి ఏటా ధమ్మచక్ర మహోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిష్ణాతులైన బౌద్ధులు, ఉపాసకులు పాల్గొంటారని చెప్పారు. అన్ని కులాలు, మతాలు, జాతుల వారు బౌద్ధ ధమ్మ ఆచరించే ప్రయత్నమే ఈ ధమ్మ చక్ర మహోత్సవమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బుద్ధిస్ట్ సొసైటీ జిల్లా అధ్యక్షులు ఎం.మల్లయ్యరాజు, బి.గౌతం, రాజాన సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ కార్మికులకు న్యాయం చేయాలి



బాణాల శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

డాబాగార్డెన్స్: రైవాడ కెనాల్‌లో నీటిలో పని చేస్తున్న 105 మంది అన్‌స్కిల్డ్ వర్కర్లకు రూ.15 నుంచి రూ.18,500కి జీతం పెంచాలని, అన్‌స్కిల్డ్‌గా పని చేస్తూ పదేళ్ల అనుభవం ఉండి, ఐటీఐ సర్టిఫికెట్ కలిగిన 119 మందికి కూడా రూ.15 వేల నుంచి రూ.18,500కి జీతం పెంచేలా కౌన్సిల్‌లో ఆమోదం తెలిపి ప్రభుత్వానికి పంపాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్. సత్యం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావును వారి చాంబర్లలో కలిసి వినతిపత్రం అందజేశారు.